క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ చోడవరం మండల స్థాయి సమావేశం

చోడవరం: వైఎస్సార్‌సీపీ చోడవరం మండల స్థాయి సమావేశాన్ని ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దొడ్డి వెంకట్రావు (డి.వి.ఆర్), దేవరపల్లి సత్య చెప్పారు. చోడవరం పట్టణంలో లక్ష్మమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గల సీతారామ కల్యాణ మండపంలో ఈ సమావేశం ఉదయం 9.30గంటలకు జరుగుతుందని వారు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త, మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని వారు చెప్పారు. చోడవరం పట్టణం, మండలంలో ఉన్న అన్ని గ్రామాల వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

నాతవరం మండల ప్రత్యేకాధికారిగా మంగవేణి



నాతవరం: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జి.మంగవేణి నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేసిన ప్రత్యేకాధికారి నాగ శిరీషా బదిలీ అయ్యారు. మంగవేణి శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. మండలానికి సంబంధించి పలు అంశాలను కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మాకవరపాలెం: రాచపల్లి రెవెన్యూలో ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ రెవెన్యూలోని 737 సర్వే నంబర్‌లో సుమారు 1,500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని 40 ఏళ్ల నుంచి చుట్టుపక్కల గ్రామాల రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇందులో 600 ఎకరాల భూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించనున్నట్టు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో రైతుల ఆక్రమణల్లో ఉన్న భూములను వీఆర్వోలు, సర్వే అసిస్టెంట్లు శనివారం నుంచి సర్వే చేస్తున్నారు. సర్వే అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు వీఆర్వో సాంబ శివరావు తెలిపారు.

పీజీఆర్ఎస్‌తో ప్రజా సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి వీరంనాయుడు

మాడుగుల రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయని స్థానిక మండల ప్రత్యేకాధికారి కె. వీరంనాయుడు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం జరిగే పీజీఆర్ఎస్ ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. తహసీల్దారు రమాదేవి, ఎంపీడీవో కె.అప్పారావు, ఎస్ఐ జి. నారాయణరావు తదితర్లు పాల్గొన్నారు.

తాగునీరు అందక అవస్థలు

మాకవరపాలెం: తాగునీరు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నామని జి.కోడూరు గ్రామస్తులు తెలిపారు. చాలాకాలంగా శివారు ప్రాంతంలో ఉన్న వారికి కుళాయిల ద్వారా నీరు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అందరికీ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

హరి గిరిపై వ్యాయామ శాల ప్రారంభం



మినీ వ్యాయామశాల ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ పీడీ కిశోర్

అచ్యుతాపురం రూరల్: హరిపాలెం హరిగిరిపై విజయదుర్గ ఆలయ ప్రాంగణంలో ఎంఆర్ఎఫ్ శ్రీను సహకారం, రోటరీ క్లబ్ సౌజన్యంతో మినీ వ్యాయామశాల ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ మారిశెట్టి లక్ష్మీకాంతం సూర్యనారాయణ తెలిపారు. రూ.70 వేలతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. రోటరీ క్లబ్ పీడీ జి.కిశోర్ శనివారం దీనిని ప్రారంభించారు. ఆయనకు సర్పంచ్‌తోపాటు ఎంపీటీసీ శరగడం లక్ష్మీ జ్యోతిర్మయి ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాది అప్పలనాయుడు, కాంద్రేగుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా స్వచ్ఛ భారత్?

- ప్రభుత్వ కార్యాలయాల్లో కానరాని పరిశుభ్రత
- అడవిని తలపించేలా పరిసరాలు
- పిచ్చి మొక్కలకు నిలయాలుగా ఆఫీసులు
- దుర్గంధాన్ని వెదజల్లుతున్న ట్రెజరీ కార్యాలయ ప్రాంగణం
- విష సర్పాలకు నిలయంగా ఎంఈవో ఆఫీస్ పరిసరాలు

మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు పిచ్చి మొక్కలు, చెత్తకుప్పల మధ్య దర్శనమిస్తున్నాయి. 'స్వచ్ఛ భారత్' ఛాయలు ఇక్కడ మచ్చుకు కూడా కనిపించడం లేదు. పలు కార్యాలయాల పరిసరాలు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో తుప్పలు



పోలీసు స్టేషన్ ముందు పిచ్చి మొక్కలు



పోలీసులు పట్టుకున్న వాహనాల చుట్టూ పెరిగిన మొక్కలు



విద్యా శాఖ కార్యాలయ ప్రాంగణం దుస్థితి

నాతవరం: ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నా ఇక్కడి అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. శనివారం నిర్వహించే ఈ కార్యక్రమం ఫొటోలకు ఫోజులివ్వడానికే పరిమితమైంది. దీంతో సర్కార్‌వారి కార్యాలయాలు చెత్తకుప్పలు, పిచ్చిమొక్కల మధ్య కునారిల్లుతున్నాయి. పోలీసు స్టేషన్‌కు ఎదురుగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. వివిధ కేసుల్లో పోలీసులు పట్టుకున్న వాహనాలు స్టేషన్ ఎదురుగా ఉన్న ఎంఈవో ఆఫీసు ప్రాంగణంలో పెట్టి వదిలేశారు. ఆ వాహనాలు ఉన్న ప్రాంగణమంతా పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. ఎంఈవో కార్యాలయం చుట్టూ ఇటీవల ప్రహరీ ఏర్పాటు చేశారు. అయితే లోపల పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించడం మానేశారు. తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగం వెలుగు ఉపాధి హామీ పథకం కార్యాలయాల చుట్టూ ఏపుగా మొక్కలు పెరిగిపోయాయి. పాత ట్రెజరీ కార్యాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఇక్కడ నిత్యం విష సర్పాలు సంచరిస్తుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. ఇటీవల ఈ ప్రాంగణంలో పాములను స్థానికులు హతమార్చిన సంఘటనలు ఉన్నాయి. గ్రంథాలయ ప్రాంగణం పరిస్థితి కూడా ఇలాగే ఉంది. గ్రంథాలయాధికారి లేక ఇక్కడ పారిశుధ్య పనులు పట్టించుకునే వారు కరవయ్యారు. మండల కేంద్రానికి వివిధ పనులపై వస్తున్న ప్రజలు కార్యాలయాల చుట్టూ ఉన్న అధ్వాన పరిస్థితులను చూసి, అధికారుల నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో సైతం పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరిగి అడుగు పెట్టడానికి భయమేస్తోందని రోగులు అంటున్నారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధులకు దూరంగా ఉండాలని ప్రజలకు... అధికారులు సూచనలు చేయడమే తప్ప వారి ఆఫీసులు చుట్టూ ఉన్న అధ్వాన పరిస్థితులపై కనీసం కన్నెత్తి చూడకపోవడం దారుణం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఉన్న చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయాలని మండల వాసులు కోరుతున్నారు.



పీహెచ్‌సీ ప్రాంగణంలో..

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు, ఎంపీపీ శ్రీనివాసరావు

రోలుగుంట: ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. స్థానిక పీఏసీఎస్ వద్ద ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావుతో కలసి శనివారం ఆయన రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారుల సూచనలు రైతులు పాటించాలని తెలిపారు. వ్యవసాయాధికారి చిరంజీవి కొత్త వంగడాలు, వాటి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

జనసేన నాయకుడి సస్పెన్షన్

బుచ్చెయ్యపేట: జనసేన బుచ్చెయ్యపేట మండల యూత్ అధ్యక్షుడు షేక్ రసూల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు చోడవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు పేర్కొన్నారు. వడ్డాది కేజీబీవీ స్కూల్‌లో 6వ తరగతి విద్యార్థికి సీటు కేటాయింపులో ప్రిన్సిపాల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి, ఆమె ఆస్పత్రి పాలవడానికి కారకుడైన షేక్ రసూల్ పార్టీ విలువలకు పూర్తిగా విరుద్ధంగా ప్రవర్తించడంతో జనసేన పార్టీ ఆయనపై చర్యలు తీసుకుందన్నారు. జనసేన రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆదేశాల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు.

నెలాఖరు నాటికి తరగతి గదుల నిర్మాణం పూర్తి



ఎ.కోడూరులో అదనపు తరగతి గదుల నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఈఈ నరసింహారావు

కె.కోటపాడు : ఎ.కోడూరు హైస్కూల్‌లో రూ.31.10లక్షలతో నిర్మిస్తున్న ఆరు అదనపు గదుల పనులు చివరిదశకు చేరుకున్నట్టు సమగ్ర శిక్ష అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.వి.నరసింహారావు తెలిపారు.భవన నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. రెండు గదులను లైబ్రరీ ఏర్పాటుకు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. మిగిలిన గదులను పాఠశాల అవసరాలకు వినియోగించుకోవచ్చునని చెప్పారు. ఈ నెలాఖరులోగా భవన నిర్మాణం పూర్తవుతుందన్నారు. కింతాడ కేజీబీవీలో రూ.1.60 కోట్లతో బాలికల కళాశాల భవనాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ నిర్మాణాలు వచ్చే ఏడాది ఫిబ్రవరికల్లా పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష అభియాన్ ఏఈ అప్పలనాయుడు, ప్రధానోపాధ్యాయుడు ఎ.శేఖర్, సూర్రెడ్డి బాబూరావు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఛాయాసుధ

మాకవరపాలెం: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్త తొలగింపులో నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీవో ఛాయాసుధ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని బూరుగుపాలెం, పెద్దిపాలెంలలో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. వర్మీకంపోస్టు ఎరువు తయారీ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తాగునీటి క్లోరినేషన్‌తోపాటు వీధులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీరామ్మూర్తి మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటు

మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



శ్రీరామ్మూర్తి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : మండలంలో సింగన్నదొరపాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నారపాటి శ్రీరామ్మూర్తి మృతి పార్టీకి తీరని లోటని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. శుక్రవారం సింగన్నదొరపాలెంకు చెందిన శ్రీరామ్మూర్తి(67) అనారోగ్యంతో మృతిచెందారు. మృతి సమాచారాన్ని తెలుసుకున్న బూడి ముత్యాలనాయుడు శనివారం ఉదయం గ్రామానికి వెళ్లి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. శ్రీరామ్మూర్తి భార్య అయిన మాజీ ఎంపీపీ నారపాటి సత్యవతితో పాటు ఇద్దరు కుమారులను ఆయన ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని చెప్పారు. శ్రీరామ్మూర్తి భౌతికకాయం వద్ద కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, మాజీ జెడ్పీటీసీ ఈర్లె గంగునాయుడు(నాని), వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, బోళం కృష్ణారావు, బండారు ముత్యాలనాయుడుతో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు నివాళులర్పించారు. శ్రీరామ్మూర్తి అంతిమ యాత్రలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: విద్యార్థినుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చూపరాదని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. ఆయన తాండవ గిరిజన ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని శనివారం సందర్శించారు. ఈనెల 26వ తేదీన కొంతమంది విద్యార్థినులు కుక్క కాటుకు గురయ్యారు. వారిని పరామర్శించి, ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం పరిసరాలను, విద్యార్థినులకు అందిస్తున్న మెనూ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం విమలకుమారి, హస్టల్ మేట్రిన్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయి డీటీగా భాస్కరరావు



రావికమతం : సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్‌గా జి.భాస్కరరావు నియమితులయ్యారు.కొంకోట తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వే డీటీగా పనిచేస్తున్న ఆయనను సివిల్ సప్లయి శాఖకు ప్రభుత్వం బదిలీ చేసింది.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి



ఎం.కోటపాడు అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న చేస్తున్న పీడీ సూర్యలక్ష్మి



కేజేపురం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

మాడుగుల/మాడుగుల రూరల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చుదిద్దుతున్నామని, బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి సూచించారు. శనివారం మండలంలో ఎం.కోటపాడు, కేజే పురంలలో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో అంగన్‌వాడీలో కోర్సు పూర్తి చేసిన 5,620 మంది 5 ప్లస్ విద్యార్థులను ఇతర పాఠశాల్లో 1 వ తరగతిలో చేర్పించినట్టు చెప్పారు. 5 ప్లస్ విద్యార్థులు ఇతర పాఠశాలల్లో చేరినా సరే తల్లికి వందనం మంజూరయ్యేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల్లో మెనూ ప్రకారం చిన్నారులకు ఆహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ పిలుస్తోందిలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించి, కిట్‌లు అందజేస్తున్నట్టు చెప్పారు. అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు పి.చిన్నమ్మలు, ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి



రాజుకు నియామక పత్రం అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, జిల్లా నేత వెంకటరమణ

నాతవరం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండలంలో మాధవనగరం పంచాయతీలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆదేశాల మేరకు శనివారం వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీని నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మాధవనగరం గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా పింకే రాజు, యువజన విభాగం అధ్యక్షుడిగా మజ్జి రామకృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కూనిశెట్టి జ్యోతి, రైతు విభాగం అధ్యక్షుడిగా కేసిరెడ్డి రాజును నియమించారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు సిద్దాబత్తుల వెంకటరమణ, సర్పంచ్ సామల చింతల్లి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం



పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గాయత్రీ సేవా ట్రస్టు ప్రతినిధులు

యలమంచిలి రూరల్: తొలి తెలుగు ప్రధాని, గొప్ప ఆర్థిక సంస్కరణవేత్త, బహు భాషా కోవిదుడు పీవీ నరసింహారావు అని స్థానిక గాయత్రీ సేవా ట్రస్టు ప్రతినిధులు రాచకొండ పట్టాభిరామయ్య, పెద్దింటి సూర్యనారాయణ మూర్తి అన్నారు. భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా యలమంచిలి పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనున్న పీవీ విగ్రహానికి ట్రస్టు ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలను తీసుకొచ్చి దేశం ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోవడానికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి పీవీ అని కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు.

వచ్చే నెల 10 వరకు నట్టల నివారణ మందు



మందు వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రామ్మోహన్‌రావు



వేములపూడిలో మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న వైద్యులు నరేష్

మాకవరపాలెం: వచ్చే నెల 10వ తేదీ వరకు నట్టల నివారణ మందు వేసే కార్యక్రమం జరుగుతుందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని రాచపల్లి, మాకవరపాలెంలలో నిర్వహిస్తున్న నట్టల నివారణ మందు వేసే కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు వేయించాలన్నారు. జిల్లాలో 2,73,816 గొర్రెలు, మేకలు ఉన్నాయని చెప్పారు. వీటికి మొదటి విడతగా ఈ నెల 26 నుంచి జులై 10వ తేదీ వరకు మందు వేస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట మాకవరపాలెం, రాచపల్లి పశువైద్యాధికారులు మణిదీప్, అనిల్ ఉన్నారు.

నర్సీపట్నం: మండలంలోని వేములపూడిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మేకలు, గొర్రెలకు ఉచితంగా నట్టల నివారణ మందు వేశారు. 550 జీవాలకు మందు వేసినట్టు వెటర్నరీ డాక్టర్ నరేష్ తెలిపారు. జులై 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బోళం రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యావతారంలో జగన్నాథుడు



చోడవరంలో మత్స్యావతారంలో భక్తులకు దర్శన మిచ్చిన జగన్నాథస్వామి



మాడుగులలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

చోడవరం: జగన్నాథస్వామి దశావతారాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక కేశవస్వామి ఆలయంలో ఉపాలయంలో వేంచేసి ఉన్న బలభద్రుడు, సుభద్ర సమేతుడైన జగన్నాథస్వామికి రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో స్వామివారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. మొదటి రోజున మత్స్యావతారంలో దర్శన మిచ్చారు. ఆలయ అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు జరిపారు.

కూర్మావతారంలో..

మాడుగుల: జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం ఇంద్రద్యుమ్న హాల్‌లో జగన్నాథుడు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పండా నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వైస్ ఎంపీపీ పాలిమేర విజయలక్ష్మి దంపతులతో పాటు గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉపాధి అవకతవకల్లో వీఆర్పీలపై చర్యలేవి

సామాజిక తనిఖీ ప్రజా వేదికలో అధికారులకు నిలదీత

పాయకరావుపేట: గతేడాది చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన వీఆర్పీలుపై చర్యలేవని సర్పంచ్‌లు సామాజిక తనిఖీ ప్రజా వేదికలో అధికారులను నిలదీశారు. డ్వామా పీడీ ఆర్.పూర్ణిమ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపురం, నామవరం, గోపాలపట్నం తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన వీఆర్పీలపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన కొలతలు సక్రమంగా చూపించడం లేదని, మస్టర్లు వేసి ఉపాధి పనులు చేసినట్లు రికార్డులు చూపించారని, కందకాలు కొలతలు సక్రమంగా చూపించలేదని ఆయా గ్రామాల్లో పనులు పరిశీలనకు వెళ్లిన డీఆర్పీలు ప్రజావేదిక ఎదుట చదివి వినిపించారు. కొన్ని గ్రామాల్లో చేపట్టిన పనులు సక్రమంగా చేపట్టలేదని వీఆర్పీలపై నివేదికలు సమర్పించారు. ఈ నివేదికలను ఆధారంగా వీఆర్పీలపై విచారణ చేసి, రికార్డులు పరిశీలించి, చర్యలు తీసుకుంటామని, నిధులు దుర్వినియోగమైనట్టు రుజువైతే రికవరీలు చేపడతామన్నారు. ప్రజా వేదికను అధికారులు తూతూమంత్రంగానే చేపట్టినట్టు పలువురు సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేశారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు, 2025 జూన్‌లో చేపట్టిన పనులకు ప్రజావేదిక నిర్వహించినట్టు ఎంపీడీవో తెలిపారు.

ఎమర్జెన్సీ.. ఓ చీకటి అధ్యాయం



మాట్లాడుతున్న బీవీకే కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ సత్యారావు

మునగపాక: ఆనాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ విధించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని, అది ఓ చీకటి అధ్యాయమని విశాఖ బీవీకే కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ వై.సత్యారావు తెలిపారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో శనివారం స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీని వ్యతిరేకించిన విద్యార్థులపై పలు కేసులు పెట్టి హింసించిందన్నారు. విలేకరులను బెదిరించి ప్రింటింగ్ ప్రెస్‌లకు సైతం కరెంటు లేకుండా చేసిందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వర రావు, మళ్ల కాలేశ్వరరావు, బద్దెం సూర్యనారాయణ, యల్లపు రాజేశ్వరరావు, బొడ్డేడ భాస్కర రావు, మళ్ల మల్లయ్యనాయుడు, నరసింగరావు, కన్నప్పారావు, నాగ భూషణం పాల్గొన్నారు.